# ‘ప్రస్తుత వ్యవస్థను మార్చటానికి పోరాడుతున్న శక్తులు-ఎదుర్కొంటున్న సవాళ్ళు’ అంశంపై సిపిఐ(ఎం-ఎల్) పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో సెమినార్

**సిపిఐ(ఎం-ఎల్)** పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో ‘ప్రస్తుత వ్యవస్థను మార్చటానికి పోరాడుతున్న శక్తులు - ఎదుర్కొంటున్న సవాళ్ళు’ అంశంపై 2019 జులై 20, 21 తేదీలలో రాష్ట్ర సెమినార్ జరిగింది. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి పిలుపుమేరకు, కేంద్రకమిటి రూపొందించిన కీనోట్ ఆధారంగా కోల్‌కతాలోని ‘బరాసత్ తితుమిర్ సభాగృహ’లో రెండురోజులు ఈ సదస్సు జరిగింది. రాష్ట్రంలోని కమ్యూనిస్టు విప్లవకారులు, వామపక్షవాదులందరినీ ఈ సెమినార్‌లో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు. సిపిఐ(ఎం-ఎల్)తోబాటుగా ఈ సెమినార్‌లో సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎం-ఎల్) రెడ్‌స్టార్, పిసిసి, సిపిఐ(ఎం-ఎల్), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ భారత్, ఆర్ఎస్‌పి, ఆర్ఎస్‌పిఐ, చేతన మరియు నవంబర్ విప్లవ శతవార్షిక కమిటీలు ఈ సెమినార్‌కు హాజరయ్యాయి. మజ్దూరు క్రాంతి పరిషత్ నుండి ఓ ప్రతినిధి పరిశీలకునిగా మాత్రమే హాజరయ్యారు.

ఈ సెమినార్ నిర్వహణకు కామ్రేడ్ అలోక్ ముఖర్జీని ఎన్నుకొన్నారు. తొలుత విప్లవోద్యమ కృషిలో అమరులైన వారందరికీ జోహార్లర్పించారు. కా॥బసు విప్లవ గీతాలాలపించారు.

సిపిఐ(ఎం-ఎల్) పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటి కార్యదర్శి కా॥సుబోధ్‌మిత్ర సెమినార్ ప్రతినిధులను ఆహ్వానిస్తూ స్వాగతోపన్యాసం చేశారు. కేంద్రకమిటి రూపొందించిన కీనోట్‌ను బసు ఆచార్య ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం సెమినార్‌కు హాజరైన వివిధ సంస్థల నేతలు తమతమ అభిప్రాయాలను సెమినార్ ముందుంచారు. ఈ క్రమంలో సిపిఐ నాయకుడు కళ్యాణ్ బంధోపాధ్యాయ, సిపిఐ(ఎం) నాయకులు కల్లోల్ మజుందార్, సిపిఐ(ఎం-ఎల్) రెడ్‌స్టార్ నాయకులు ప్రదీప్‌సింగ్ ఠాకూర్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ భారత్ ప్రతినిధులనుండి కా॥గోలామ్ గజి, పిసిసిసిపిఐ(ఎం-ఎల్) నాయకుడు కా॥తపన్‌నాగ్, ఆర్ఎస్‌పి నాయకుడు కా॥అశోక్ ఘోష్, ‘చేతన’ సంస్థ నాయకుడు కా॥దేబషిష్ దత్తా, ‘నవంబర్ విప్లవ శతవార్షిక కమిటి’ ప్రతినిధి కా॥సురేష్ బైనేలు ఈ సెమినార్‌లో పాల్గొని ప్రసంగించారు. తమ అభిప్రాయాలను వెల్లడించారు.

మరునాటి ప్రారంభ సెషన్‌లో వివిధ సంస్థల నాయకులు వ్యక్తంచేసిన అభిప్రాయాలపై సెమినార్ ప్రతినిధులు తమతమ సందేహాలను, ప్రశ్నలను ముందుంచారు. సెమినార్‌కు హాజరైన ప్రముఖ బెంగాలీ రంగస్థల కళాకారుడు కా॥గౌతం ముఖర్జీ క్లుప్తంగా ప్రసంగించిన అనంతరం ప్రశ్నలకు జవాబుల కార్యక్రమం ప్రారంభమైంది. నిర్దిష్ట పార్టీ ప్రతినిధిని ఉద్దేశించి కొందరు ప్రతినిధులు ప్రశ్నలు వేయగా, మరికొందరు రెండు, మూడు సంస్థలను ఉద్దేశించి ప్రశ్నలు అడిగారు. ఈ కార్యక్రమంలో సెమినార్ ప్రతినిధులంతా శ్రద్ధగా పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనానంతరము కూడా ఈ కార్యక్రమం కొనసాగింది. ప్రతినిధులు వ్యక్తంచేసిన వాటిల్లో భిన్నాభిప్రాయాలు వున్నప్పటికీ, మతతత్వం, జాతీయ దురహంకారాలపై ఆధారపడి ముందుకొస్తున్న ఫాసిజం ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆవశ్యకతను ప్రతినిధులంతా నొక్కి చెప్పారు. పశ్చిమబెంగాల్ నిర్దిష్ట పరిస్థితుల్లో మమతా బెనర్జి నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రతినిధులంతా స్పష్టంగా ముందుకు తెచ్చారు.

ఈ సెషన్ తర్వాత వివిధ సంస్థల నాయకులంతా కొద్దిసేపు ప్రత్యేకంగా సమావేశమై ఒక సంయుక్త ప్రకటనను వెలువరించారు. ఆర్‌సిపిఐ నాయకులు కా॥ప్రబీర్ అధికారి మొదటిరోజు సెషన్‌లో పాల్గొనలేకపోయినప్పటికి, రెండవరోజు సెషన్‌లో చర్చలలో చురుకైన పాత్ర వహించి, సంయుక్త తీర్మానం చేయటంలో తోడ్పడ్డారు. నక్సల్బరీ రైతాంగ ఉద్యమంలో వీరోచితంగా పాల్గొని, నేటికీ ఉద్యమ కృషిలో వున్న కామ్రేడ్ శాంతిముండా సిపిఐ(ఎం-ఎల్) ప్రతినిధిగా సెమినార్‌లో పాల్గొని సెమినార్‌కు హాజరైన ప్రతినిధులందరకూ అభినందనలు తెలియచేశారు.

సెమినార్‌ను నిర్వహించిన కామ్రేడ్ అలోక్‌ముఖర్జీ సంయుక్త ప్రకటనను ప్రతినిధుల ముందుంచారు.

1. ప్రస్తుత పరిస్థితుల్లోని సవాళ్ళను ఎదుర్కొనేందుకు ఇలాంటి చర్చలు జరపటాన్ని, అభిప్రాయాలను ఇచ్చి పుచ్చుకోవటాన్ని కొనసాగించాలని ఏకగ్రీవంగా సెమినార్ తీర్మానించింది.
2. ఈ సెమినార్‌లో పాల్గొనలేని ఇతర వామపక్ష, అభ్యుదయ శక్తులు కూడా ఈ క్రమంలో పాలుపంచుకోవాలని ఈ సెమినార్‌కు హాజరైన ప్రతినిధులంతా పిలుపునిచ్చారు.
3. ఫాశిస్టు వ్యతిరేక, ప్రజాస్వామ్య, లౌకికశక్తులన్నీ, వామపక్షాలన్నీ ఈ చొరవకు తమ మద్దతునందించాలని పిలుపునిచ్చారు.

ఈ తీర్మానాన్ని ప్రతినిధులంతా బలపరిచారు. ఈ సెమినార్ నిర్వహించిన సిపిఐ(ఎం-ఎల్) సంస్థే తదుపరి సమావేశానికి కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. అధ్యక్షుని క్లుప్తమైన ఉపన్యాసంతో సెమినార్ ముగిసింది.

ooo